ఒక్కరోజు ఆటేనా..!

- ప్రారంభం రోజు ఆడారు... మళ్లీ వదిలేశారు...
- జవహర్‌నగర్‌లో కలగా మిలిగిన మినీ స్టేడియం నిర్మాణం
- ఆచరణకు నోచుకోని ప్రజాప్రతినిధుల హామీలు
- ప్రతిభ ఉన్నా.. వెలుగులోకి రాని క్రీడాకారుల ప్రతిభ


గత సంవత్సరం జూన్ 2న క్రీడా మైదానాన్ని ప్రారంభిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్ (ఫైల్)

జవహర్‌నగర్: క్రీడలపై ఆసక్తి ఉన్నా క్రీడా మైదానం లేక ఔత్సాహిక క్రీడాకారులు తమ ప్రతిభకు పదును పెట్టలేకపోతున్నారు. ప్రజాప్రతినిధులు వారి పబ్బం గడుపటానికి హామీలు ఇచ్చారే తప్ప అమలుకు ఏ మాత్రం చర్యలు తీసుకోలేదని, దీంతో జవహర్‌నగర్‌లో మినీ స్టేడియం ఏర్పాటు హామీలకే పరిమితమైందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి విద్యార్థులు, జాతీయ, రాష్ట్రస్థాయిలో పోటీల్లో రాణిస్తున్నా సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్టేడియం లేకపోవడంతో సత్తా ఉన్న ఎంతో మంది యువకులు వారి నైపుణ్యాలను తీర్చిదిద్దుకొని మెరుగ్గా రాణించలేకపోతున్నారు. మినీస్టేడియం ఏర్పాటుతో పాటు యువ క్రీడాకారులకు తగిన వసతులు సౌకర్యాలు కల్పించడంలో అటు ప్రభుత్వం ఇటు అధికారులు ప్రజాప్రతినిధులు విఫలమైయ్యారని క్రీడాభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హామీలు గాలికి...

జవహర్‌నగర్‌లో మినీ స్టేడియం ఏర్పాటుకు పాలకులు ఇచ్చిన హామీలు గాలికి వదిలేశారు. జవహర్‌నగర్‌లో 2 జిల్లా పరిషత్, 8 ప్రై మరీ పాఠశాలుండగా దాదాపు 30 పైగా ప్రైవేట్ పాఠశాలున్నాయి. జవహర్‌నగర్‌లోని క్రీడాకారులు అరకొర వసతులున్నా జాతీయ, రాష్ట్రస్థాయికి ఎంతోమంది విద్యార్థులు ఎంపికై విజయాలు సాధించి బహుమతులు సాధించారు. క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమాల్లో పాల్గొన్న అతిథులు, నాయకులు, అధికారులు జవహర్‌నగర్‌లో మినీ స్టేడియం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా ఆచరణలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారింది. దీంతో క్రీడాకారులకు మినీ స్టేడియం నిర్మాణం కలగానే మిగిలిపోయింది.

మరెన్నో పతకాలు సాధించే అవకాశం..

మినీస్టేడియం ఏర్పాటు చేస్తే క్రికెట్‌తో పాటు వాలీబాల్, కరాటే, అథ్లెటిక్స్ కబడ్డీ, ఖోఖో, టెన్నిస్ తదితర క్రీడాపోటీల్లో మరింత రాణించే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు మినీ స్టేడియం ఏర్పాటుపై శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు ..

జవహర్‌నగర్ పట్టణంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని గతంలో ఎన్నోసార్లు విద్యార్థులు, విద్యార్థి సంఘాలు అధికారులను, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించినా ఫలితం లేకుండా పోయింది. జవహర్‌నగర్‌లో దాదాపు 3 లక్షల జనాభా ఉన్నారు. వీరిలో ఒక లక్షకు పైగా యువకులు ఉన్నారు. గత కొన్ని రోజుల క్రితం మేయర్ కావ్య సమక్షంలో హడావుడిగా జవహర్‌నగర్‌లోని సర్వే నెం. 704, 706లలో 5 ఎకరాల స్థలంలో గత సంవత్సరం జూన్ 2న మినీ స్టేడియం పనులు ప్రారంభించినా ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టలేదు. దీంతో తెలంగాణ ప్రభుత్వ క్రీడా మైదానం పేరుతో పెట్టిన బోర్డును సైతం తొలగించారు.


క్రీడా మైదానాన్ని ప్రారంభించి మొదటి రోజు క్రీడలు ఆడుతున్న సభ్యులు (ఫైల్)

జవహర్‌నగర్ మున్సిపల్‌కు అప్పగించిన స్థలాలు...

జవహర్‌నగర్ కార్పొరేషన్ ఏర్పడిన తర్వాత ప్రభుత్వం ప్రజా అవసరాల కోసం వివిధ స్థలాలను కేటాయించింది. సర్వే నెం. 510లో చిల్డ్రన్స్ పార్క్ (17 గుంటలు), సర్వే నెం. 495/ఇలో మోడ్రన్ షీ టాయిలెట్స్‌కు (510 గజాలు) ,420/ ఇ లో మినీ డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం (20 గుంటలు), 432/ ఇలో మోడ్రన్ షీ టాయిలెట్స్‌కు (1500 గజాలు), సర్వే నెం. 648లో నర్సరీ (4.10 గుంటలు), 647/ ఇలో తంగెడు వనం (1 ఎకర 34 గుంటలు) సర్వే నెం.704,706లలో మినీ స్టేడియం (5 ఎకరాలు), సర్వే నెం. 759, 954లలో హెర్బల్ పార్క్ (4 ఎకరాల 03 గుంటలు), సర్వేనెం.673/ ఇలో బృహత్ పట్టణ ప్రకృతి వనం (4 ఎకరాలు), సర్వే నెం. 706లో వైకుంఠధామం (2 ఎకరాలు), సర్వే నెం. 173, 201లలో వైకుంఠధామం (1 ఎకర 6 గుంటలు), 614/ ఇ 615/ ఇ లలో వెజ్‌నాన్‌వెజ్ మార్కెట్ (2 ఎకరాలు), సర్వే నెం .70లో జంతు జనన, నియంత్రణ కేంద్రం (1 ఎకర). వీటిలో ఒకటి రెండు మినహా ఇప్పటి వరకు ఏ స్థలాన్ని మున్సిపల్ అధికారులు పరిరక్షించుకో లేకపోయారు.

ఆట స్థలం లేక ఇబ్బందులు ..



జవహర్‌నగర్‌లో మినీ స్టేడియం లేక నిరుపేద క్రీడాకారులు తమ ప్రతిభ చూపలేకపోతున్నారు. ప్రతిభ ఉన్నా ఆట స్థలం, సరైన శిక్షణ లేకపోవడంతో ఆటల్లో రాణించలేకపోతున్నారు. గతంలో చాలా మంది రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగిన క్రీడాకారులున్నారు. ఇప్పటి కైనా యువక్రీడాకారులను దృష్టిలో పెట్టుకుని చేయుతనివ్వాలి.

– కానుగంటి నరేందర్‌యాదవ్, మేడ్చల్ జిల్లాతైక్వాండో యూనియన్ ప్రధానకార్యదర్శి

స్టేడియంతో పాటు కోచ్‌ను నియమించాలి...



మూడు లక్షల జనాభా నివసించే జవహర్‌నగర్‌లో మినీస్టేడియం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అథ్లెటిక్స్‌లో ఎంతో మంది యువకులు విద్యార్థులు రాణించే అవకాశం ఉంది. మినీస్టేడియం ఏర్పాటు చేస్తే జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగేందుకు దోహదపడుతుంది.

– కూరపాటి రాజశేఖర్, ఫిజికల్ డైరెక్టర్, సీఆర్‌పీఎఫ్ పాఠశాల

కేటాయించిన అన్ని స్థలాలను కాపాడుతాం...



జవహర్‌నగర్‌లో ప్రజా అవసరాల కోసం కేటాయించిన ప్రతీ స్థలాన్ని కాపాడుతాం. ఇప్పటికే కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కలెక్టర్‌తో మాట్లాడి మరిన్ని నిధులు తీసుకువచ్చి కేటాయించిన స్థలాలన్నింటికి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తాం. రెవెన్యూ శాఖ మున్సిపల్‌కు కేటాయించిన కొన్ని స్థలాల్లో కోర్టు వివాదాలున్నాయి. వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం.

– తాజ్‌మోహన్‌రెడ్డి, జవహర్‌నగర్ కార్పొరేషన్, కమిషనర్



తెక్వాండో టోర్నమెంట్‌లో పతకం సాధించిన జవహర్‌నగర్ విద్యార్థులు

భూములు పరిరక్షించడంలో అధికారులు విఫలం....

ప్రభుత్వం ప్రజా అవసరాల నిమిత్తం మున్సిపాలిటీకి కేటాయించిన స్థలాలను కాపాడుకోవడంలో పాలకవర్గం, అధికారులు పూర్తిస్థాయిలో విఫలమవుతున్నారు. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపల్ ఆపై కార్పొరేషన్‌గా అవతరించిన అనంతరం రెవెన్యూ అధికారులు ప్రజా అవసరాల కోసం వివిధ ప్రాంతాలలో కేటాయించిన ఏ ఒక్క స్థలాన్ని స్వాధీనం చేసుకుని అభివృద్ధి పనులు ప్రారంభించిన దాఖలాలు కనిపించడం లేదు. కేటాయించిన స్థలాలలో కనీసం ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో అవి అక్రమాక్కుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

మేడ్చల్: ప్రయాణికుల సమస్యలు, సూచనలు తెలుసుకోవడానికి మేడ్చల్ డిపోలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం సుధాకర్ తెలిపారు. ప్రయాణికులు సాయంత్రం 4 గంటల నుంచి 5గంటల వరకు 9959226152 ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సూచనలు తెలపాలని కోరారు.

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసిన ఎంపీ ఈటల

రాష్ట్రంలోని రోడ్ల అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: కేంద్ర రోడ్డు, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఢిల్లీలో ఆయనను కలిసిన రాజేందర్ రాష్ట్రంలోని పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా కొంపల్లి ఫ్లై ఓవర్ల అండర్ పాస్, నత్తనడకన సాగుతున్న ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్, శామీర్‌పేట రోడ్డు, ఎల్బీనగర్ అండర్‌పాస్, హుజూరాబాద్ రోడ్డు సమస్యలపై చర్చించారు. హైదరాబాద్‌లో నిర్మించే అన్నీ అండర్‌పాస్‌లు కాకుండా ఫ్లై ఓవర్లు నిర్మించాలని కోరారు. హుజూరాబాద్‌లో సింగాపూర్, రాంపూర్, రంగాపూర్, పెద్దపాపయపల్లి ప్రాంతాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా సర్వీస్ రోడ్డు నిర్మాణం చేయాలని కోరారు. ఈటల రాజేందర్ లేవనెత్తిన సమస్యలపై స్పందించిన నితిన్ గడ్కరీ మరోసారి సమగ్రంగా సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

చెట్లే మానవ మనుగడకు జీవనాధారం


మొక్కలు నాటుతున్న కౌన్సిలర్ మల్లిఖార్జున్, ఏఈ వెంకటేశ్‌గౌడ్

మేడ్చల్ రూరల్: పర్యావరణ సమతుల్యత సక్రమంగా ఉంటేనే మానవ మనుగడకు మంచిదని ఇందు కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని గుండ్లపోచంపల్లి మున్సిపల్ కౌన్సిలర్ దొడ్ల మల్లిఖార్జున్ ముదిరాజ్ అన్నారు. శనివారం ప్రపంచ వృక్ష దినోత్సవం, దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఆయన మున్సిపల్ పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈ వెంకటేశ్ గౌడ్, మున్సిపల్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లే ప్రతి జీవరాశి మనుగడకు అవసరమని అలాంటి చెట్లను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలకు చిన్నపాటి నుంచే చెట్ల ప్రాధాన్యత వివరించాలని కోరారు.

నూతన కార్యాలయాలతో మెరుగైన సేవలు


భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఈడీ వెంకటేశ్వర్లు

మేడ్చల్: నూతన కార్యాలయాలతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు అన్నారు. మేడ్చల్ డిపో ఆవరణలో డీఎం కార్యాలయ భవనానికి ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేశారు. నూతనంగా ఆర్టీసీ డిపో ఆవరణలో కార్యాలయ సముదాయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో ఈడీ అధికారులతో కలిసి శంకుస్థాపన శనివారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం ఖుష్రోషా ఖాన్, డీవీఎం కవిత, సికింద్రాబాద్ ఏఈ వెంకటరమణ, డీఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో 87 శాతం ఉత్తీర్ణత

సాక్షి, మేడ్చల్ జిల్లా: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ (2024) పరీక్షలకు సంబంధించి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 4,881 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, ఇందులో 4,248 –(87.03 శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి తెలిపారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 3,088 మంది బాలురు హాజరు కాగా ఇందులో 2,680 మంది బాలురు ఉత్తీర్ణత సాధించారన్నారు. అలాగే, బాలికలు 1,793 మంది హాజరు కాగా, 1,568 మంది ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పేర్కొన్నారు.

విరాళం అందజేత

మేడ్చల్ రూరల్: మండలంలోని పూడూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న షిర్డీ సాయిబాబా ఆలయ నిర్మాణానికి గ్రామ మాజీ వార్డు సభ్యులు, జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి యాటవెళ్లి హన్మంత్‌రెడ్డి రూ.51 వేల విరాళం అందజేశారు. ఆలయ నిర్వాహకులు వెంకట్రాంరెడ్డికి ఆలయం వద్ద చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు శశికుమార్, సాకేత్‌రెడ్డి, చెన్నయాదవ్, తుపాకుల మల్లిఖార్జున్,గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఊరెళ్లొచ్చేసరికి...

ఇంట్లో చోరీ... బంగారు ఆభరణాలు, నగదు మాయం

ఘట్ కేసర్: ఊరికి వెళ్లి తిరిగి వచ్చే సరికి ఇంట్లో చోరీ జరిగిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్ఎఫ్‌సీనగర్‌కు చెందిన కుమార్ శ్రీవాత్సవ్ (35) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఈ నెల 7న ఇంటికి తాళం వేసి మియాపూర్‌లోని అద్దె ఇంటికి వెళ్లగా అతడి సోదరుడు ఉత్తరప్రదేశ్‌కు వెళ్లాడు. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి గుర్తు తెలియని దుండగులు ఇంటి ప్రధాన ద్వారం పగులగొట్టారు. లోపలికి వెళ్లి అల్మారా తెరిచి చూడగా అందులో దాచిన బంగారు నల్ల పూసల దండ, రెండు బంగారు నాణేలు, బంగారు చెవి రింగులు, ఒక ఉంగరం, కొన్ని వెండి నాణేలు, కొంత నగదు కనిపించలేదు. అతడి సోదరుడి బెడ్ రూం తాళం కూడా పగులగొట్టి, అల్మారా తెరిచి ఉంది. అందులో ఏమేమి వస్తువులు ఎత్తుకెళ్లారో తెలియ లేదు. వెంటనే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

సర్వసభ్య సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్


మాట్లాడుతున్న బెస్త వెంకటేష్ తదితరులు

కీసర: డ్వాక్రా సంఘాల మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాపరిషత్ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్ అన్నారు. శుక్రవారం కీసర మండల పరిషత్ కార్యాలయ సమీపంలో స్నేహ మహిళా సొసైటీ 14వ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘం ద్వారా రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఆయన సూచించారు. సంఘంలో లావాదేవీలు, వ్యక్తిగత రుణాలపై చర్చించారు. గతంలో పనిచేసిన మేనేజర్ ఇష్టానుసారంగా వ్యక్తిగత రుణాలు ఇచ్చి, ఖర్చులు భారీగా చేశారని సభ్యులు ఆరోపించారు. సంఘంలోని సభ్యులకు కాకుండా ఇతరులకు రూ. 10 లక్షల వరకు ఎలాంటి సాక్ష్యం లేకుండా ఇచ్చారన్నారు. సంఘంలో జరిగిన అవకతవకలపై తగు విచారణ చేపట్టాలని సభ్యులు సమావేశంలో కోరారు.ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ జలాల్‌పురం సత్తిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, టి.నారాయణ, మంచాల కిరణ్‌జ్యోతి ప్రవీణ్, సొసైటీ చైర్మన్ పండుగ స్వప్న, సెక్రటరీ, పర్జన, డైరెక్టర్లు పద్మ, జగదాంబ, మీరమణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలి


సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు, సభ్యులు

మేడ్చల్ రూరల్: వర్షాకాలం ప్రారంభమైనందున ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా పారిశుధ్య నిర్వహణపై అధికారులు, సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మిశ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ రాములు తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో నిత్యం పారిశుధ్య పనులు చేపట్టాలని, దోమల నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు అంటు వ్యాధులు, సీజనల్ వాధ్యుల బారిన పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆషాఢ బోనాల సందర్భంగా ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాటు చేయాలని సూచించారు. పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ తీర్మానం చేసింది. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, డిప్యూటీ ఈఈ దుర్గప్రసాద్, జేఏవో ప్రణతిరెడ్డి, వార్డు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

30న మేడ్చల్‌లో బోనాలు

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలో బోనాల పండగను ఈనెల 30వ తేదీన నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక నర్సింహ్మారెడ్డి తెలిపారు. పట్టణంలోని కట్ట మైసమ్మ తల్లికి ఆదివారం బోనాల పండగ నిర్వహించి ఉత్సవాలను ప్రారంభిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఊరేగింపు, గావు పట్టడం, రంగం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు ఉత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా కొండాపూర్ 33/11కేవీ సబ్‌స్టేషన్ అవుషాపూర్ 11కేవీ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అవుషాపూర్ గ్రామం, జగత్ స్వప్న వెంచర్, కేపాల్, అనురాగ్ కళాశాల, వినూత్న హైట్స్, అరోరా కళాశాల, శ్రీనిధి రిసార్ట్స్, గోల్డెన్ వాలీ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఘట్‌కేసర్ ఏఈ సతీశ్‌కుమార్ తెలిపారు.

ప్రజల మన్ననలు పొందేలా సేవలు అందించాలి


సమావేశంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డీసీపీ కోటిరెడ్డి

మేడ్చల్ రూరల్: ప్రజల నుంచి మరింత మన్ననలు పొందేలా పోలీసులు తమ సేవలు అందించాలని మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. మేడ్చల్ జోన్ పరిధిలోని ఎస్ఐ, పై స్థాయి అధికారులతో శుక్రవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి హితం ఇంజనీరింగ్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ, సీఐల నుంచి జోన్ పరిస్థితి సమీక్షించి వారి పనితీరు తెలుసుకున్నారు. జోన్ పరిధిలోని సిబ్బంది పనితీరు మరింత మెరుగుపరుచుకోవాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అంకిత భావంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ నర్సింహ్మారెడ్డి, ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

మేడ్చల్: మండలంలోని సైదనిగడ్డతండా పరిధిలోని సర్వే నంబర్ 747, 748లలో మూడు ఎకరాల 33 గుంటల భూమి కబ్జాకు గురవుతున్నా తహసీల్దార్ పట్టించుకోవడం లేదని గ్రామానికి చెందిన ధన్‌రాజ్‌నాయక్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ అలసత్వంతోనే ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని, భూమిని కాపాడని తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

బండిసంజయ్‌కు శుభాకాంక్షలు


బండి సంజయ్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్నకీసర మండల బీజేపీ నేతలు

కీసర: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను శుక్రవారం ఢిల్లీలో కీసర మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి కోలబాల్ రాజ్‌యాదవ్, జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షులు నల్లవెంకట్ రెడ్డి, బస్వరాజుగౌడ్, సదానందరెడ్డి తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బండిసంజయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో మరెన్నో ఉన్నత పదువులు చేపట్టాలని వారు ఆకాంక్షించారు.

పనస పండ్ల చాటున గంజాయి తరలింపు

గంజాయిని తరలిస్తున్న ముఠాను పట్టుకున్న పోలీసులు



శామీర్‌పేట్: పనస పండ్ల చాటున గంజాయిని తరలిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమీప ప్రాంతాల నుంచి కరీంనగర్ వైపు ఓ బొలేరో వాహనంలో గంజాయి తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓఆర్ఆర్ ఎగ్జిట్ నుంచి కరీంనగర్ – హైదరాబాద్ రాజీవ్ రహదారిలో మేడ్చల్ ఎస్వోటీ, శామీర్‌పేట పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఏపీ 39 యుూయుూ 4550 నంబరు గల బొలేరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా పనసపండ్ల లోడులో గంజాయిని తరలిస్తున్నారని గుర్తించారు. అంతేకాకుండా గంజాయి తరలిస్తున్న ఈ బొలేరో వాహనాన్ని మరో కారు అనుసరిస్తుండగా పోలీసులు కారుతో పాటు గంజాయిని, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

అకౌంట్ ఆఫీసర్ నియామక పరీక్షలకు ఏర్పాట్లు

సంబంధిత అధికారులను ఆదేశించిన కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పరీక్షలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సాఫీగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ నెల 30 నుంచి జూలై 04 వరకు కొనసాగనున్న డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ నియామక రాత పరీక్షను పురస్కరించుకుని శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయం సముదాయంలో సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఎగ్జామ్ ఏర్పాట్లపై అధికారులకు ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ నియామక రాత పరీక్షలో నిర్ణీత తేదీలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 9.30 గంటల లోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. మధ్యాహ్నం 2 గంటల లోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఆలస్యమైతే పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరగదన్నారు. పరీక్షలు సాఫీగా కొనసాగేలా సంబంధిత అధికారులతో పాటు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులు, సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పరీక్షా కేంద్రాలలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, మంచినీరు, ఫస్ట్ ఎయిడ్ చికిత్సకు ఏఎంఎంలను ఏర్పాటు చేయాలని, సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. బయోమెట్రిక్ విధానం అమలులో ఉన్నందున అభ్యర్థులు కనీసం రెండు గంటల ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. అధికారులు అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఈటల నివాసం ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా


రాజేందర్ ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

మేడ్చల్‌రూరల్: నీట్ పేపర్‌లో జరిగిన అవకతవకలపై దేశ ప్రధాని ఛాయ్‌పే చర్చా కార్యక్రమం నిర్వహించాలని విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం మేడ్చల్ మండలంలోని పూడూర్ గ్రామ పరిధిలోని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఇంటి ముట్టడికి విద్యార్థి సంఘాలు యత్నించాయి. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ ఇంటి ఎదుట బైఠాయించి ఆందోళన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రధాని మోదీ నీట్ పేపర్ లీకేజీ అంశంపై చర్చించాలన్నారు. విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష తిరిగి నిర్వహించాలని, పరీక్ష నిర్వహణలో పారదర్శకత లేని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ రద్దు చేయాలన్నారు. నీట్ పరీక్ష వల్ల నష్టపోయిన తెలుగు రాష్ట్రాల విద్యార్థుల పక్షాన నోరు మెదపని ఎంపీ ఈటల రాజేందర్ తన పదవికి రాజీనామా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు రాహుల్‌యాదవ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు మహేశ్, గిరిబాబు, వినయ్, నాగరాజు, ప్రీతమ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనారాయణ జన్మదినోత్సవం


జన్మదినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న మల్లారపు లక్ష్మీనారాయణ

కీసర: శ్రీ చీర్యాల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆయన స్వామివారిసేవలో పాల్గొన్నారు. స్వామివారి ప్రత్యేకపూజల అనంతరం వేదపండితులు ఆయన స్వామివారి ఆశీర్వచనాలను అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, అభిమానుల సమక్షంలో కేక్‌కట్ చేసి పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీనారాయణ, ఆలయధర్మకర్త శ్రీహరిగౌడ్, గ్రామస్తులు, శ్రీనివాస్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.